# క్రీస్తును ఎవరు సిలువ వేసారు?

## ( Who Crucified Christ ? )

క్రీస్తును ఎవరు సిలువ వేసారనే దాని పై వాగ్వాదము శతాబ్దముల తరబడి జరుగుచునేయున్నది. ఆపని ఎవరు చేసారు? ఎవరిని నిందించాలి? నిజానికి ఈ విషయంలో ఏ ఒక్క వ్యక్తిని లేక గుంపును మనం నిందించ లేము.

**అయితే మొదటిగా, సాతానుడు క్రీస్తును సిలువ వేసాడని తెలిసి కొందాము.** ఏదెను వనంలో సాతానుడు ఆదాము హవ్వలను శోధించాడు. నిషేధింపబడిన ఫలమును వారు తిన్నారు. తద్వారా లోకాన్నంతటిని పాపములో ముంచారు. ''ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, అలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్త మాయెను" అని రోమా 5:12 చెప్పుచున్నది. పాపము వలన క్రీస్తు సిలువ అవుసరమాయెను. మానవుడు రక్షింప బడే విధానము అదొక్కటే, దేవుడు దీనిని ముందుగానే చూచెను. అందువలన జగదుత్పత్తి మొదలుకొని వధింపబడిన గొర్రెపిల్ల క్రీస్తు (ప్రక 13:8). పాపము ఈ లోకములో ప్రవేశించిన తరువాత మొదటి ప్రవచనము చెప్పబడెను. ఆదికాండము 3:15 ఇట్లు చెప్పుచున్నది : "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదువని" దేవుడు సాతానుతో చెప్పెను. క్రీస్తు సిలువ మరణము అపవాదికి మరణాఘాతమాయెను. దాని నుండి అది తిరిగి లేవలేదు. క్రీస్తు సిలువ మరణము వలన అపవాదికి ఆయన మడిమె మీద కొట్టుటకు అవకాశము దొరికెను.



క్రీస్తును సిలువ నుండి మరలించడానికి అరణ్యములో ఆయనను అపవాది శోధించెను (మత్త 4:1-13). గాని అది నిష్ప్రయోజన మాయెను. ఆత్మను రక్షించే శక్తి సిలువలో యున్నదని అపవాది ఎరుగును. అందువలన మానవులను క్రీస్తు నుండి దూరము చేయాలని అది ప్రయత్నించును. వాడు మానవుని మిత్రుడుకాదు. ఎవని మ్రింగుదునా యను గర్జించు సింహము వలె అతడు యెదకుచు తిరుగుచున్నాడు (1 పేతురు 5:8). మనుష్యులు దేవుని వాక్యమును విని విశ్వసించి రక్షింపబడకుండా వారి హృదయములో నుండి వాక్యమును ఎత్తుకొనిపోవును (లూకా 8:12). దానిని చేయలేకపోతే సువార్త వెలుగు ప్రకాశింపకుండా వారి మనోనేత్రముల కతడు అవిశ్వాసము వలన గ్రుడ్డి తనము కలుగజేయును (2 కొరింథీ 4:4). అతడు లోకము నంతటినీ మోసగించ ప్రయత్నించును (ప్రక 12:12). ప్రభువైన యేసును అప్పగించిన ఇస్కరియోతు యూదా హృదయములో అతడు ప్రవేశించెను (లూకా 22:3). సాతాను యొక్క ప్రయత్నముల వలన క్రీస్తు సిలువ వేయబడెను. దీన్ని గూర్చి సంశయం యేమీ లేదు. వాని ప్రయత్నము వలన క్రీస్తు సిలువ నెక్కెను.

**రెండవదిగా, యూదులు క్రీస్తును సిలువకు మేకులతో కొట్టిరి.** వారే స్వయంగా ఆ పనిచేయలేదు. గాని వారి కోరికమేరకు రోమీయులు యేసును సిలువ వేసిరి. పిలాతు తన చేతులు కడుగుకొని యేసు నిర్దోషియని ప్రకటించెను. "అందుకు ప్రజలందరు – వాని రక్తము మామీదను, మా పిల్లల మీదను ఉండుగాకనిరి" (మత్తయి 27:25). "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింప బడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి" యని పేతురు యూదులకు తెలియజెప్పెను (అపొ.కా. 2:23). "మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను

మృతులలో నుండి లేపెను” అని అపొ.కా. 3:15లో అతడు మరల తెలియజేసెను. రోమీయులు యేసును సిలువకు మేకులతో కొట్టిరి, గాని యూదుల కోరిక మేరకు వారట్లు చేసిరి.

**మూడవదిగా మానవ జాతియే యేసును సిలువ వేయించెను.** యెషయా 53:5,6 ఇట్లు చెప్పుచున్నది. “మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనందరము గొర్రెలవలె త్రోవతప్పిపోతిమి, మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషము అతనిమీద మోపెను”. ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను” (2కొరింథి 5:12). “మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి” యని పేతురు చెప్పెను (1 పేతురు 2:24). యేసు లోక రక్షకుడు (యోహాను 4:42). “ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వ లోకమునకును శాంతికరమైయున్నాడు” (1యోహాను 2:2). నిజంయేమంటే, నీవు నేను యేసును సిలువపైకి ఎక్కించాము.

**నాల్గవదిగా యేసు ప్రభువు తనకు తానే సిలువ వేయబడెను.** జగదుత్పత్తి మొదలుకొని వధించబడిన గొర్రెపిల్ల ఆయనే. ఆయన చేయవలసిన దేమిటో ఆయన ఎరుగును. యోహాను 10:17,18లో ఆయన మాటలను వినుము : “నేను దానిని మరల తీసుకొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందు



వలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దానిని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసుకొనుటకును నాకు అధికారము కలదు”. యేసు బుద్ధిపూర్వకముగా, ఇష్టపూర్వకముగా సిలువపై బలియాయెను. తండ్రియైన దేవుడు ఆయనను అందు నిమిత్తము బలవంతము చేయలేదు. ఆయన స్వేచ్ఛాపూర్వకముగా దాన్ని జరిగించెను. అయితే యేసు ఇష్టపూర్వకముగా ఎందుకు సిలువనెక్కెను? ఆయన మనలను ప్రేమించినందు వలన!

**చివరిగా తండ్రియైన దేవుడు యేసును సిలువ వేయించెను.** “అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను, ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను... అతడు తనకు కలిగిన వేదన చూచి తృప్తినొందును అని యెషయా 53:10,11లో చెప్పబడినది. ఏలయనగా, “దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయన ననుగ్రహించెను” (యోహాను 3:16). “అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే, క్రీస్తు మనకొరకు చనిపోయెను” (రోమా 5:8).

చివరి సమీక్షలో మనం యూదులను, రోమీయులను, అపవాదిని క్రీస్తును సిలువ వేయించినందుకు నిందించవచ్చును. గాని చివరికి మనలను మనమే నిందించుకోవాలి తప్ప ఇంకెవరినీ కాదు. నా మట్టుకు నేను నన్ను తప్ప ఎవరినీ నిందించను. నా పాపములే క్రీస్తు ప్రభువును ఆ ఘోరమైన సిలువకు మేకులతో కొట్టెను!

**- జాన్ స్టేసీ**